క్లుప్తంగా

ఆయుష్ సెంటర్ మరమ్మతుల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని ములకలూరు గ్రామంలో గల ఆయుష్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌లోని మరమ్మతు పనులను గ్రామసర్పంచ్ కంచర్ల వెంకటేశ్వర్లు, ఆయుష్ వైద్యాధికారి ఆర్.శ్రీనివాస్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ.3.50లక్షల నిధులతో మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. జనఆరోగ్య సమితి సభ్యులు కంచర్ల భాస్కరరావు, కంచర్ల చిన సుబ్బారావు, సోమేపల్లి కొండలు పాల్గొన్నారు.

నేడు శానంపూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష



శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామసచివాలయం పరిధిలో నేడు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ పేరుమీనా సీతారామయ్య ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిలోని వారిని వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించి 10 నుంచి 17 సంవత్సరాల లోపు వారందరి హిమోగ్లోబిన్ శాతం, 18 సంవత్సరాల దాటిని వారందరికి బీపీ, షుగర్ తదితర వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఇందులో భాగంగా సచివాలయ పరిధిలో శానంపూడి, ముంద్రువారిపాలెం గ్రామాలు ఉండగా నివాస గృహాలు 1000 గాను 17 మంది వలంటీర్లు సారథ్యంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వివిధ రకాల వైద్య పరీక్షలు 2వేల మందికి చేసినట్లు చెప్పారు. 95 శాతం సర్వే పూర్తి అయిందన్నారు. ఆయనతో పాటు మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి వేముల వెంకట భాస్కర్, ఆరోగ్య కార్యకర్త బాజిసైదా, ఎంఎల్‌హెచ్‌పీ సునీత ఉన్నారు.

విద్యార్థులకు చేతిరాతపై శిక్షణ



శావల్యాపురం: విద్యార్థులు పరీక్షల్లో మంచి మార్కుల సాధనకు చక్కని దస్తూరి (చేతిరాత) ఎంతోగానో దోహదపడుతుందని జడ్పీ ఉన్నత పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ పల్లపాటి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని వేల్పూరు గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాల్లో పదో తరగతి విద్యార్థులకు దస్తూరి మెరుగుదలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఫైనల్ పరీక్షల్లో తెలుగు, ఆంగ్ల భాషలకు సంబంధించి చక్కని దస్తూరి ఉన్నవారికి ప్రత్యేకంగా మార్కులు కేటాయిస్తారన్నారు. దాతల సహకారంతో దస్తూరి నిపుణులు నోట్ పుస్తకాలన్నీ సమకూర్చారన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. వేల్పూరులో ప్రభుత్వ పాఠశాలలు అభ్యున్నతికి వివేకనంద పూర్వ విద్యార్థులు కమిటీ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. పూర్వ విద్యార్థుల కమిటీ ప్రతినిధులు సంద్రపాటి చలపతిరావు, గట్టుపల్లి వీరాస్వామి, దస్తూరి నిపుణులు శ్రీనివాసరావు, పొత్తూరి వెంకట పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయుడు జ్యోతి శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలుగుపాటకు పట్టాభిషేకం చేసిన ఎస్పీ బాలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- పల్నాడు జిల్లా ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తృతీయ వర్ధంతి సభ



కార్యక్రమంలో ఎమ్మెల్యే గోపిరెడ్డిని సన్మానించిన సుశీల్‌కుమార్, కళాకారులు

నరసరావుపేట: పాడుతా తీయగా అంటూ పాటకు పట్టాభిషేకం చేసి, తెలుగు వారి లోగిళ్లలో పాటల పూలవనాల్ని పూయించిన అక్షర తోటమాలి పద్మవిభూషణ్ స్వర్గీయ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఎస్పీ తృతీయ వర్ధంతి సందర్భంగా పల్నాడు జిల్లా ఆర్కెస్ట్రా కళాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని టౌన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 1946 జూన్ 4న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో జన్మించిన ఎస్పీ బాలు సంగీత ప్రపంచంలో చిన్న వయసులోనే ప్రయాణం మొదలుపెట్టారన్నారు. బహుళ భాషలలో ప్రతి స్వరం, సాహిత్యంలో భావోద్వేగాలను నింపగల ఆయన సామర్థ్యం భారతదేశం అంతటా మారుమోగిందన్నారు. 16 విభిన్న భాషల్లో 40వేల పాటలకు తన గాత్రాన్ని అందించారన్నారు. ప్రపంచంలోని అత్యంత విజయవంతమైన నేపథ్య గాయకులలో ఒకరిగా నిలిచారన్నారు. ఇళయరాజా, ఏఆర్ రెహమాన్, ఆర్‌డీ బర్మన్ వంటి దిగ్గజ సంగీత స్వరకర్తలతో అతని సహచర్యం చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. సంగీత స్వరకర్తగా, నటుడిగా, డబ్బింగ్ కళాకారుడిగా ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం రాణించారన్నారు. ఆయనకు క్రాఫ్ట్‌పై అంకితభావం, ఎప్పుడూ నవ్వుతూ ఉండే అతని ప్రవర్తన, సంగీతంపై అతని అభిరుచి ఔత్సాహిక కళాకారులకు ప్రేరణగా ఉపయోగపడతాయన్నారు. భారతీయ సంగీతంపై చెరగని ముద్ర వేయడమే కాకుండా తన కళాత్మకతతో, మానవత్వంతో కోట్లాది మంది జీవితాలను స్పృశించిన బహుముఖ ప్రజ్ఞాశాలి అన్నారు. అనంతరం పలువురు కళాకారులను దుశ్శాలువాలతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో సంరక్ష సొసైటీ కార్యదర్శి బీఆర్ సుశీల్‌కుమార్, డప్పు శ్రీను, ఆర్కెస్ట్రా కళాకారులు, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి దసరా వేడుకలు ప్రారంభం



అమ్మవారి మూలవిరాట్

శావల్యాపురం: మండల కేంద్రం శావల్యాపురంలో వేంచేసియున్న కనకదుర్గమ్మ అమ్మవారి దేవాలయంలో దసరా ఉత్సవాలు ఈనెల 15 నుంచి 23 వరకు జరుగుతాయని దేవాలయ ధర్మకర్త రెడ్డి జ్వాలా నరసింహారావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా శరన్నవరాత్రి 22వ వార్షికోత్సవాలు గ్రామస్తులు, దాతల సహకారంతో వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఆలయ పూజారి రావిపాటి సాయిభరత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. రాత్రిళ్లు దేవాలయం ప్రాంగణంలో భక్తి బృందంచే భజనలు, అనంతరం మహిళ భక్తులకు ప్రోత్సాహక బహుమతులు లాటరీ విధానం ద్వారా పంపిణీ చేస్తామన్నారు. దసరా ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు రోజుకో అలంకరణతో భక్తులకు దర్శనం ఇస్తారన్నారు. భక్తులందరు అధిక సంఖ్యలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించాలన్నారు.

ఎమ్మెల్సీ ఏసురత్నం సన్మానంపై కరపత్రం ఆవిష్కరణ



కరపత్రం ఆవిష్కరిస్తున్న వడ్డెర ఉద్యోగులు

నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్ వడియ రాజు ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన గుంటూరులోని మెడికల్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎన్జీఓ కల్యాణ మండప ఫంక్షన్ హాలులో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నంకు ఘన సన్మానం చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వడ్డెర ఉద్యోగుల సమక్షంలో కరపత్రం విడుదల చేశారు. ఈ సన్మాన సభకు ప్రతి ఒక్కరూ విచ్చేసి జయప్రదం చేసి ఉద్యోగుల ఐక్యతను చాటాలని ఆహ్వానకమిటీ నాయకులు కోరారు.

సాహిత్యసేవ అభినందనీయం

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



యువ కవులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట ఈస్ట్: అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ శ్రీశ్రీ కళావేదిక నిర్వహిస్తున్న సాహితీ యజ్ఞం అభినందనీయమని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళావేదిక ఆధ్వర్యంలో ఆదివారం రామిరెడ్డిపేటలో పల్నాడు కవితోత్సవం పేరిట ఏర్పాటు చేసిన 124వ జాతీయ శతాధిక కవి సమ్మేళనాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. కవితోత్సవంలో పాల్గొన్న కవులను అభినందించారు. కళావేదిక నిరంతరం కవి సమ్మేళనాలను నిర్వహిస్తూ సాహిత్య సేవ చేయటంపై హర్షం వ్యక్తం చేశారు. శ్రీనాథుడు, కొప్పరపు కవులు, విశ్వకవి గుర్రం జాషువా వంటి మహనీయులకు అలవాలమైన పల్నాటి గడ్డ సాహిత్య సేవలో నిరంతరం తరిస్తున్నదని వివరించారు. ఈసందర్భంగా కవితోత్సవానికి హాజరైన కవులను ఘనంగా సత్కరించారు. తొలుత సాహితీమూర్తుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళావేదిక చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్‌ను గజమాలతో సత్కరించారు. అలాగే కళావేదిక జిల్లా అధ్యక్షురాలు శాంతిభాయ్ గాయనిగా రూపొందించిన సీడీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకుడు కందుల ఎజ్రా తదితరులు పాల్గొన్నారు.

తూనికల అధికారుల తనిఖీలు

ఏడుగురి వద్ద అపరాధ రుసుము వసూలు



గణపవరంలో ఓ చికెన్ దుకాణంలో ఎలక్ట్రానిక్ కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ శంకరరావు

నాదెండ్ల: తూనికలు, కొలత ల శాఖ అధికారులు ఆదివారం మేజర్ పంచాయతీ గణపవరం గ్రామంలో పలు వ్యాపార దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. కాటాల్లో వ్యత్యాసం ఉన్న ఏడుగురిని గుర్తించారు. వీరి వద్ద అపరాధ రుసుము వసూలు చేశారు. చికెన్ షాపు లు, చిల్లర దుకాణాల్లో ఉన్న ఎలక్ట్రానిక్ కాటాలు, కాటా రాళ్లు, అడ్డకాటా తదితర వాటిని పరిశీలించారు. ప్రతి ఏడాది ఎలక్ట్రానిక్ కాటాలు ఉన్న యజమానులు రెన్యువల్ చేయించుకోవాలని, కాటా రాళ్లు, అడ్డకాటా ఉన్న వాళ్లు ప్రతి రెండేళ్లకోసారి తప్పనిసరిగా తూనికలు, కొలతల శాఖ అధికారుల వద్ద రెన్యువల్ చేయించుకోవాలన్నారు. తూనికల్లో తేడాలు ఉంటే చర్యలు తప్పవని నరసరావుపేట ఏరియా ఇన్‌స్పెక్టర్ శంకరరావు హెచ్చరించారు. ఆయనతో పాటూ సిబ్బంది వీరయ్య ఉన్నారు.

నేటి నుంచి అర్బన్ స్కూల్స్ కబడ్డీ పోటీలు

వినుకొండ(నూజెండ్ల): సాయిరామ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో ఈ నెల 9,10 తేదీల్లో నిర్వహించే వినుకొండ అర్బన్ స్కూల్స్ కబడ్డీ పోటీల వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మానసిక ఉల్లాసానికి దోహదపడతాయన్నారు. కబడ్డీ విజేతలకు మొదటి బహుమతి రూ. 10,116, ద్వితీయ బహుమతి రూ.7,116, తృతీయ బహుమతి రూ.5,116 ఈ నెల 11వ తేదీన కలెక్టర్ లోతేటి శివశంకర్, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదుగా అందజేయనున్నట్లు స్కూల్ డైరెక్టర్ ముప్పాళ్ల చంద్ర తెలిపారు. కార్యక్రమంలో బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బి.వి.నాగేశ్వరరావు, 19వ వార్డు కౌన్సిలర్ ఎంఎస్‌కే బాషా, ఉపాధ్యాయులు ఎస్.రాజాచౌదరి, సెల్వరాజ్, గద్దె రామకోటేశ్వరరావు, ఎస్‌కే ఫయాజ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ క్లబ్ వార్షికోత్సవం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో ఉన్న కేజీఎల్ కల్యాణ మండపంలో వినుకొండ వాసవీ క్లబ్స్ ఆధ్వర్యంలో వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ 19వ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్ నుంచి వచ్చినటువంటి కేసీజీఎఫ్ అగిరి వెంకటేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని వినుకొండ వాసవీ క్లబ్స్ సేవలను కొనియాడారు. ప్రజలకు వాసవిక్లబ్స్ ఎన్నో స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. అనంతరం డిస్ట్రిక్ట్ గవర్నర్ ఖజ్జాయం విజయలక్ష్మి సుబ్బారావు సేవలను అభినందించారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు మెమోంటోలు అందజేశారు. 450 మంది వాసవిక్లబ్స్ సభ్యులను దుశ్శాలువాలతో, షీల్డ్‌లతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గుడిపాటి రమేష్‌బాబు, పొట్టి హనుమంతరావు, కె.శ్రీనివాసరావు, కొత్తమాసు సుజాతలక్ష్మి, గుడిమెట్ల సత్యనారాయణ, జవ్వాజీ సువర్ణ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి
- గురవాయపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం



మహిళలకు సంక్షేమ లబ్ధి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట రూరల్: రాష్ట్రంలోని 85శాతం కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందజేసినట్లు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండలంలోని గురవాయపాలెంలో ఆదివారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో గ్రామానికి రూ.17కోట్లతో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్నారని తెలిపారు. గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని తెలిపారు. అవినీతి కేసులో జైలుకు వెళ్లిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదని అన్నారు. పూటకో మాట మార్చే పవన్ కల్యాణ్ మాటలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ కురుగుంట్ల మాణిక్యాలరావు, గుడిపూడి దాసు, తన్నీరు రామాంజనేయులు, తన్నీరు హనుమంతరావు, జాగర్లమూడి వసంతరావు, గడిపూడి నాగయ్య పాల్గొన్నారు.

కాశీ అన్నపూర్ణ సత్రం సేవలు విలువైనవి

చిలకలూరిపేట: కాశీ అన్నపూర్ణ సత్రం సేవలు ఎంతో విలువైనవని మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని కొనియాడారు. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణమండపంలో కాశీ అన్నపూర్ణసత్రం ఆధ్వర్యంలో నిరుపేద ఒంటరి మహిళ కె.శ్రీదేవి కుమారుడు ఎనిమిదో తరగతి చదువుతున్న తేజా రంగారావుకు, ఆరో తరగతి చదువుతున్న కుమార్తె మీనాక్షికి కలిపి రూ.31వేలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కాశీ అన్నపూర్ణ సత్రం సభ్యులు వారణాసి, తిరుపతి, షిరిడీ, హరిద్వార్ వంటి పుణ్యక్షేత్రాల్లో యాత్రికులకు అన్నదాన సౌకర్యం కల్పించటంతోపాటు నిరుపేద విద్యార్థులకు లక్షలాది రూపాయలు ఆర్థిక సహాయం అందించటం ఆదర్శనీయమని వెల్లడించారు. కాశీ అన్నదాన సత్రం విద్యానిధి కన్వీనర్ పొట్టి శ్రీరాములు, మున్సిపల్ వైస్ చైర్మన్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ కె.రామారావు, కేవీఎస్ కృష్ణుడు, నరేంద్ర, గట్టా హేమ పాల్గొన్నారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

ఈపూరు: మండలంలోని చిట్టాపురం గ్రామంలో పేకాట ఆడుతున్న ఆరుగురిని పోలీసులు ఆదివారం అరెస్ట్ చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఈపూరు ఎస్‌ఐ మహమ్మద్ ఫిరోజ్ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4960 నగదు, 5 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



1986-87 బ్యాచ్ 10వ తరగతి విద్యార్థులు

బొల్లాపల్లి: మండలంలోని బండ్లమోటు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. 1986-87 బ్యాచ్‌కి చెందిన 10వ తరగతి విద్యార్థులు పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరి గురించి ఒకరు క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి స్నేహం గురించి ముచ్చటించారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను గుర్తు చేసుకున్నారు. చదువు అనంతరం వివిధ ప్రదేశాల్లో ఉద్యోగ, వ్యాపారాల్లో స్థిరపడిన పూర్వవిద్యార్థులు తమకు అక్షరం నేర్పిన పాఠశాలలో ఆనాటి ఊసులను నెమరువేసుకున్నారు. కుటుంబసభ్యులతో సహా హాజరై ఆత్మీయ సమ్మేళనంలో కలిసి భోజనాలు చేస్తూ ఆనందంగా గడిపారు.

పట్టణ యాదవ సంఘం నూతన కార్యవర్గం ఎంపిక



నూతన కార్యవర్గం

చిలకలూరిపేట: పట్టణ యాదవ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని సింగు కళ్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడిగా మసిముక్కల శ్రీనివాసరావు, కార్యదర్శిగా గోపిదేశి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా యలగాల రామాంజనేయులు, సంయుక్త కార్యదర్శిగా తాడిపోయిన శ్రీనివాసరావు, కోశాధికారిగా గోపిదేశి గంగాధర్‌లను ఎన్నుకున్నారు. సంఘ గౌరవ అధ్యక్షులుగా గోరంట్ల నారాయణ, పోటు శ్రీనివాసరావు, గాలం కోటేశ్వరరావులను ఎంపిక చేశారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా 11 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘ గౌరవ అధ్యక్షుడు గోరంట్ల నారాయణ మాట్లాడుతూ సంఘ బలోపేతానికి అందరూ ఐక్యంగా కృషి చేయాలని కోరారు.